క్లుప్తంగా

వేడుకగా కృష్ణాష్టమి వేడుకలు



నృత్యప్రదర్శన చేసిన చిన్నారులను అభినందిస్తున్న నిర్వాహకులు

విజయనగరం: పట్టణంలోని ఆర్య సోమయాజులు కాశీపతిరావు భవనంలో ఆదివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్కార భారతి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గూటాల రామ్ కుమార్ ప్రారంభించారు. రచయిత్రి చివుకుల శ్రీలక్ష్మి, డాక్టర్ కడలి అన్నపూర్ణ, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, తదితరులు భాగవత విశేషాలను తెలియజేశారు. అనంతరం డాక్టర్ జక్కు రామకృష్ణను సత్కరించారు. భగవతి నృత్య కళామందిర్ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. శ్రీకృష్ణుని బాల్య లీలలపై చిత్రలేఖనం, వేషధారణ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో భగవతి నృత్య కళామందిర్ ప్రిన్సిపాల్ రమణకుమారి, సాలూరి సంతోషిణి, హేమంత్, సుమారు 150 మంది చిన్నారులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



కార్మికులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రామారావు

నెల్లిమర్ల: ప్రధాని మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలని సీపీఎం నాయకుడు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జూట్‌మిల్ గేటు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ, మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేయడం వల్ల కార్మిక, వ్యవసాయ, విద్యుత్ రంగాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

6న వేషధారణ పోటీలు

చీపురుపల్లి: శ్రీ కృష్ణజన్మాష్టమిని పురస్కరించుకుని ఈనెల 6న బెస్ట్ కృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్లు స్థానిక బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రం ఇన్‌చార్జి బీకే శాంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో సాయంత్రం 5.30 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని, 5 ఏళ్ల లోపు పిల్లలకు జూనియర్స్ విభాగంలో, 6 ఏళ్ల నుంచి 10 ఏళ్ల వయస్సు గల పిల్లలకు సీనియర్ విభాగంలో రాధా, కృష్ణుల వేషధారణ పోటీలు వేర్వేరుగా ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు రెండు నుంచి మూడు నిమిషాలు నిడివిలో శ్రీ కృష్ణునికి సంబంధించిన కథ, శ్లోకం చెప్పాలని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9000108721, 8309974599, 9381722360 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

దుకాణాలకు వేలం రేపు

చీపురుపల్లి: పట్టణంలోని సర్వే నంబర్ 45/1లో ఉన్న శ్రీ నీలకంఠేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 16 బిట్లలో గల దుకాణాలు, ఖాళీ స్థలం నెలవారీ అద్దెల కోసం ఈనెల 5న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ బి.హెచ్.ఎస్.ఎస్.కిశోర్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5న ఉదయం 10 గంటల కు దేవస్థానం కార్యాలయం వద్ద వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మూడేళ్ల కాలపరిమితిలో అద్దెలు చెల్లిస్తూ దుకాణాలు నిర్వహించుకునేందుకు, ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

సేవాదృక్పథం కలిగి ఉండాలి



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డీటీ రమేష్, సర్పంచ్ కొండలరావు

కొత్తవలస: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని, ప్రధానంగా యువత వీలైనంత ఎక్కువగా సేవా కార్యక్రమాల్లో భాగ స్వామ్యం కావాలని డిప్యూటీ తహసీల్దార్(డీటీ) టి.రమేష్ కోరారు. మండలంలోని తుమ్మికాపల్లికి చెందిన ఫర్ ది ఫీపుల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 39 మంది ఒంటరి మహిళలకు 12 రకాల నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన డీటీ మాట్లాడుతూ ఫర్ ది ఫీపుల్ చారిటబుల్ ట్రస్టు సేవలను కొనియాడారు. తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు మాట్లాడుతూ ట్రస్టు అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. ట్రస్టు కార్యవర్గ సభ్యులు శ్రావణ్‌కుమార్, సంతోష్‌కుమార్, ధర్మ, గణేష్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నాడు కష్టంగా... నేడు ఇష్టంగా..



టీడీపీ హయాంలో మొయిద ప్రాథమిక పాఠశాలలో ఖాళీ కంచాలతో నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు (ఫైల్)

- ప్రభుత్వ పాఠశాలల్లో మారిన మెనూ
- ఫలితాన్నిచ్చిన జగనన్న గోరుముద్ద పథకం
- ఇష్టంగా తింటున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: సరిగ్గా ఐదేళ్ల కిందట టీడీపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని నవ ప్రయాస్ అనే స్వచ్ఛంధ సంస్థకు అప్పగించింది. పైలెట్ ప్రాజెక్ట్‌గా నెల్లిమర్ల మండల కేంద్రంలో క్యాంటీన్ ఏర్పాటు చేసి ఇక్కడి నుంచి నెల్లిమర్ల, విజయనగరం నియోజకవర్గాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు ఆటోల ద్వారా భోజనాన్ని సరఫరా చేసేవారు. ఒక వైపు మధ్యాహ్న భోజన నిర్వాహకుల పొట్ట కొట్టడంతో పాటు మరో వైపు ఉడికీ ఉడకని భోజనాన్ని సరఫరా చేసి విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడారు. ప్రస్తుతం ఆ రోజులు మారాయి.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజన నిర్వాహణ తీరే మారిపోయింది. నాడు తినలేక బయట పారబోసిన విద్యార్థులు.. నేడు ఒక్క మెతుకు కూడా వదలకుండా ఇష్టంగా తింటున్నారు.

విద్యార్థుల కష్టాలకు ఐదేళ్లు....

సరిగ్గా ఐదేళ్ల కిందట ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినాలంటే నరకమే.... ఆకలిని తట్టుకోలేక ఒక వేళ భోజనం చేసినప్పటికీ రుచించక విద్యార్థులు వాంతులు చేసుకునేవారు. పరిస్థితిని చూసిన తల్లిదండ్రులు తమ పిల్లల చేతికి బాక్సులు ఇచ్చి బడికి పంపించేవారు.. భోజనం నచ్చక విద్యార్థులు, విద్యార్థుల పరిస్థితిని చూడలేక ఉపాధ్యాయులు అప్పటిలో నిరసనలు కూడా చేపట్టారు. ప్రతి రోజూ హెచ్ఎంలు విద్యాశాఖాధికారులకు ఫిర్యాదులు చేసేవారు. దీనికంతటికీ ప్రధాన కారణం గత ప్రభుత్వ వైఫల్యమేనని చెప్పవచ్చు.



వైఎస్సార్‌సీపీ హయాంలో కొండవెలగాడ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఇష్టంగా తింటున్న విద్యార్థులు

నవప్రయాస్ అనే ప్రైవేట్ ఏజెన్సీకి మధ్యాహ్న భోజన పథకాన్ని అప్పజెప్పడంతో నెల్లిమర్ల మండల కేంద్రంగా పూసపాటిరేగ, డెంకాడ, విజయనగరం మండలాల్లో ఉన్న పాఠశాలలకు నిత్యం భోజనం సరఫరా అయ్యేది. ఉడికీ ఉడకని భోజనం తయారు కావడం.. మధ్యాహ్నం 3 గంటల తర్వాత పాఠశాలలకు భోజనం సరఫరా చేయడంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు.

చేదు అనుభవాలకు చెక్..

గత చేదు అనుభవాలు విద్యార్థులకు ఎదురవ్వకూడదనే ఏకైక లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న గోరుముద్ద కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు ఇప్పుడు ఎంచక్కా అన్నం, పప్పుచారు, కోడిగుడ్డు కూర, చిక్కీ, వెజిటబుల్ రైస్, ఆలూ కూర్మా, ఉడకబెట్టిన గుడ్డు, కిచిడీ, టమాటా చట్నీ, ఆకుకూర పప్పు, స్వీట్ రకాలను అందించాలని ప్రభుత్వం నూతన మెనూ అమలు చేయడంతో భోజన నిర్వాహకులు వారాల ప్రకారం వండి పెడుతున్నారు. దీంతో విద్యార్థులు ఎంతో ఇష్టంగా భోజనం తింటున్నారు. ఐరన్ శాతాన్ని పెంచేందుకు విద్యార్థులకు రాగిజావ కూడా విజయవంతంగా పంపిణీ చేస్తున్నారు.

నాణ్యమైన భోజనం..



విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడడం లేదు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ భోజన నాణ్యతను పరిశీలిస్తున్నారు. ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారు. ప్రతిరోజూ పాఠశాలలను సందర్శించి, లోటుపాట్లను సరిచేస్తున్నాం.

– ఈపు విజయ్‌కుమార్, ఎంఈఓ-2, నెల్లిమర్ల

భోజనం బాగుంది..



పాఠశాలలో పెడుతున్న భోజనం చాలా బాగుంది. పరిశుభ్రమైన ప్రాంతంలో వంటలు వండుతూ వేడి వేడిగా అందిస్తున్నారు. గతంలో భోజనం అసలు బాగుండేది కాదు. ప్రస్తుతం రోజుకో రకంతో భోజనం పెడుతున్నారు. రాగి జావ కూడా రోజు తప్పించి రోజు ఇస్తున్నారు.

– లెంక పవన్‌కుమార్, విద్యార్థి, ఏటీ అగ్రహారం ప్రాథమిక పాఠశాల

అసంపూర్తిగా హైవే సర్వీస్ రోడ్డు



పూసపాటిరేగలో అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రహదారి

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తిచేసి సర్వీస్ రహదారిని అసంపూర్తిగా వదిలేయడంతో వాహన చోధకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సర్వీస్ రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించకపోవడంతో రహదారిపైనే వర్షపు నీరు నిలిచిపోతోంది. కాలువ నిర్మించకపోవడంతో రజకవీధి, కెల్లవీధి నుంచి వస్తున్న వర్షపునీరు, మురుగునీరుకు దారి లేకుండా పోయింది. దీంతో చిన్నపాటి వర్షానికి లోతట్టులో వున్న రజక, కెల్లవీధి ముంపునకు గురవుతున్నాయి. హైవే ఉన్నత అధికారులు స్పందించి సర్వీస్ రహదారితో పాటు కాలువ నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ....

- సీపీఎం నాయకులు



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు శంకరరావు

విజయనగరం పూల్‌బాగ్: తాము అధికారంలోకి వస్తే ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన బీజేపీ పెద్దలు తొమ్మిదేళ్ల కాలంలో ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు, ఎ. జగన్మోహనరావు ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా సీపీఎం సమరభేరిలో భాగంగా ఆదివారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో నిరుద్యోగ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైల్వేలో ఖాళీలు భర్తీ చేయకపోవడంతో వరుస ప్రమాదాలతో ప్రజలు ప్రాణాలు గాల్లో కలిసిపోతుంటే.. ప్రధాని మోదీ మౌనం వహించడం సరికాదన్నారు. పైగా ప్రమాదాలకు మతం రంగు పులమడం బాధాకరమన్నారు. నిరుద్యోగం, అధిక ధరలు, విద్యుత్ చార్జీలు, కరెంటు కోతలు, తదితర సమస్యలపై సోమవారం ఉదయం పది గంటలకు తహసీల్దార్ ఆఫీస్ వద్ద జరగనున్న ధర్నాలో ప్రజలు, యువత పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చికిత్సతో ఆటిజం తగ్గుదల

విజయనగరం: ఆటిజం అనేది ప్రస్తుతం చాలామంది పిల్లల్లో తరుచుగా కనిపిస్తోందని, ముందస్తు చికిత్సతోనే ఆటిజం లక్షణాలను తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుందని చిన్న పిల్లల వైద్య నిపుణులు ఎం.వెంకటేశ్వరరావు, ఎం.డి రెహమాన్ అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ, ఆటిజం అనేది తల్లిదండ్రుల ద్వారా పుట్టే బిడ్డకి వచ్చే అవకాశం ఉందన్నారు. పెళ్లికి ముందే సరైన అవగాహన కలిగిఉండి, ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. ఆటిజంతో బాధపడే పిల్లలు కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని, తల్లిదండ్రులు ఓపికతో వ్యవహరించి మార్పు తీసుకురావాలన్నారు. ఎ కిడ్స్ కేర్ ఎం.డి పవన్ మాట్లాడుతూ, విజయనగరంలోనే ఆటిజంనకు వైద్యసేవలు లభిస్తున్నాయని చెప్పారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు

కార్యక్రమంలో తల్లిదండ్రులు, కిడ్స్ కేర్ డైరెక్టర్ ఎన్.జగన్నాథరావు, సిబ్బంది సిరి, ప్రసన్న, వాసు, యమున, కృష్ణవేణి, శ్వేతా, వినీల శశికళ, ప్రతిమ, హేమ, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం

దత్తిరాజేరు: మండల కేంద్రంలో శాఖా గ్రంథాలయం నూతన భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలో భవనాన్ని ప్రారంభించనున్నట్లు గ్రంథాల య అధికారి రాజు తెలిపారు. ప్రస్తుతం గ్రంథాలయాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నామని, సమస్య ను జిల్లా గ్రంథాలయ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో, సొంత భవనం నిర్మాణం కోసం రూ.25 లక్షలు మంజూ రు చేశారని చెప్పారు. ఈ నిధులతో అన్ని సదుపాయాలతో భవనం నిర్మిం చామని, త్వరలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రారంభించ నున్నారని ఆయన తెలిపారు. సొంత భవనం అందుబాటులోకి వస్తుండడంతో పాఠకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా పాటల పోటీలు

విజయనగరం టౌన్: పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో డాక్టర్ అక్కెన బాల నాగ శ్రీకర్ ఆధ్వర్యంలో ట్రాక్ సినిమా పాటల పోటీలు ఆదివారం నిర్వహించారు. విజేతలకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా ఈ నెల 25న బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకుడు ఎ.శ్రీరామ్మూర్తి తెలిపారు. సుమారు 120 మంది గాయకులు పాల్గొనగా.. న్యాయ నిర్ణేతలుగా మూర్తి, పద్మనాభం వ్యవహరించారు.

గ్యాస్ ధర తగ్గింపులో మోసం..

- డీసీసీ అధ్యక్షుడు రమేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ. 200 తగ్గించడం వెనుక మోసం దాగి ఉందని డీసీసీ అధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం స్థానిక డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2004లో రూ. 250 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1150కు పెంచిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. పెంచిన ధరలో కొంత తగ్గించి, ప్రజలను ఏమారుస్తున్నారని ఆరోపించారు. అలాగే నిరుద్యోగులకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కరీం, తదితరులు పాల్గొన్నారు.

5న భగవద్గీత శ్లోక పఠన పోటీలు

చీపురుపల్లి: స్థానిక కొత్తగవిడివీధిలోని గీతామందిరంలో ఈనెల 5న భగవద్గీత శ్లోక కంఠస్థ పఠన పోటీలు నిర్వహించనున్నట్లు గీతా సత్సంగ్ సేవాశ్రమం ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను ముందుగానే 9440105279, 7302760344 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



పూజలు చేస్తున్న త్రినాథమూర్తి, పెద్దలు

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం గ్రామ సమీపంలో వెదుళ్ల పైడితల్లమ్మ వారి ఆలయ పునర్నిర్మాణానికి వీరభద్రపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు గేదెల త్రినాథమూర్తి దంపతులు, పెద్దలు ఆదివారం శంకుస్థాపన చేశారు. వేద పండితులు అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరభద్రపురం, నరపాం, కర్రిచిన్నయ్యపాలెం, వియ్యంపేట, మునగపాకవానిపాలెం, గొల్లలపాలెం, కొటానివానిపాలెం గ్రామాలకు ఈ అమ్మవారు గ్రామదేవత. అమ్మవారి పండగను ఏటా ఈ ఏడు గ్రామాల వారు వైభవంగా నిర్వహిస్తుంటారు. ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో ఏడు గ్రామాల ప్రజలు రూ.70 లక్షలు చందా పోగుచేసి ఆలయ పునర్నిర్మాణానికి సిద్ధమయ్యారు. శంకుస్థాపన పూజుల్లో ఏడు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళల ముందడుగు..

- పీఎంఈజీపీపై పెరుగుతున్న ఆసక్తి
- స్వయం ఉపాధికి సబ్సిడీపై రుణాలు



గొడిపాలెంలో టెంట్‌హౌస్ ఏర్పాటు చేసిన బుత్తల వెంకటలక్ష్మి



పీఎంఈజీపీ ద్వారా మోపాడలో పేపర్‌పేట్ల యూనిట్ ఏర్పాటు చేసిన మజ్జి అప్పలకొండ

డెంకాడ: స్వయం ఉపాధికి చేయూత అందించే ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ప్రోగ్రాంపై ఆసక్తి కనబరుస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా మహిళా లబ్ధిదారులు ఎక్కువగా దరఖాస్తు చేస్తున్నారు. జిల్లా పరిశ్రమలశాఖ, ఖాదీబోర్డు, ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ సంస్థల ద్వారా లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేస్తున్నారు. పథకంలో భాగంగా రకరకాల స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. టెంట్‌హౌస్, పేపర్‌ప్లేట్ల మిషన్, ఫొటోగ్రఫీకి కెమెరాలు, జిరాక్స్ మిషన్, కంప్యూటర్లు, కాంక్రీట్ మిక్సర్ మిషన్, ట్రాలీ, చెరకు క్రషింగ్ మిషన్, ఎయిర్ కంప్రెషర్, ఆయిల్‌మిల్, మగ్గం ఎంబ్రాయిడరీ మిషన్, టైలరింగ్, డెయిరీ, గొర్రెలు ఇలా పలు రకాల యూనిట్లకు సబ్సిడీపై రుణం అందిస్తారు. లక్ష రూపాయల నుంచి రూ.20 లక్షల వరకూ స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 31 శాతం రాయితీపైన.. ఓసీ, బీసీలకు 25 శాతం రాయితీపై రుణాలు అందిస్తారు.

వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా మహిళలకు..

మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేయాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌క్రాంతి పథం ద్వారా ప్రత్యేకించి మహిళలకు రుణాలు మంజూరు చేస్తున్నారు. వారి పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారాలను నిర్వహించుకునేందుకు రాయితీ కల్పిస్తున్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలు కావడమే లక్ష్యం



మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలన్న సంకల్పంతో వైఎస్సార్‌క్రాంతి పథం ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నాం. ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించి వారికి ఉన్న ఆసక్తి, అక్కడ ఉన్న పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారాల నిర్వహణకు కావాల్సిన యూనిట్లను మంజూరు చేస్తున్నాం.

– విజయలక్ష్మి, ఏపీఎం, డెంకాడ.

యూనిట్ల మంజూరు..

ఇంతవరకు నెల్లిమర్ల నియోజకవర్గంలోని డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల్లో 50 వరకు వివిధ రకాల యూనిట్లు మంజూరయ్యాయి. అలాగే రెండు వందల మంది వివిధ రకాల వ్యాపారాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం దరఖాస్తులు పరిశీలన దశలో ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సంఖ్య పెరిగింది.

ప్రజాసేవే మా అభిమతం



పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్ విజయలక్ష్మి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 1వ డివిజన్‌లో రూ.57 లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులు ప్రారంభం

విజయనగరం: ప్రజలకు సేవ చేయడమే తమ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ పూల్‌బాగ్ ప్రాంతంలోని హనుమాన్‌నగర్, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంతాలలో వివిధ అభివృద్ధి పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. రూ. 57 లక్షలతో నిర్మించిన రహదారులు, కాలువలను ప్రారంభించి ప్రజావినియోగంలోకి తీసుకొచ్చారు. ఎన్నో ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొన్న స్థానికులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చొరవతో రహదారి నిర్మాణం పూర్తి కావడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు ముద్దాడ మధు, ముచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజాసేవే పరమార్థంగా నగరంలోని అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి అభినందనీయలని కొనియాడారు. అభివృద్ధి పనులు చేపట్టి, వాటిని ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ఒకటో డివిజన్ ప్రాంతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి ప్రస్తుతం జరుగుతోందన్నారు. అందుకే ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. కోలగట్ల వీరభద్రస్వామిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, మాజీ కౌన్సిలర్ గదుల సత్యలత, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసు, సీతాలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సర్వం సిద్ధం



వివరాలు వెల్లడిస్తున్న, సమితి ప్రతినిధులు శంకరరావు, తదితరులు

విజయనగరం టౌన్: జగద్గురు శ్రీకృష్ణ భగవానుడి జన్మాష్టమి వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు వానపల్లి శంకరరావు తెలిపారు. ఆదివారం స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో జన్మాష్టమి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల ఆరో తేదీ నుంచి పది వరకు వేడుకలు నిర్వహిస్తామన్నారు. గురజాడ కళాభారతి వేదికతో పాటు నెల్లిమర్ల, గజపతినగరం, బొబ్బిలి, తదితర ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, భగవద్గీత శ్లోకాల పోటీలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక నాటికలు, ప్రవచనాలు , భగవద్గీత సారాంశం వివరించడం, తదితర కార్యక్రమాలు చేపడతామన్నారు. చివరి రోజు పట్టణంలో భారీ పల్లకీ ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు సీఎస్‌వీ నాయుడు, రాజేష్, ఆదినారాయణ, ప్రసాద్, జగన్నాథం, ఉపేంద్ర, కోటి, సూరిబాబు, వంశీ, సుబ్బు, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.